# సహజ సౌందర్యాభిలాషి

కనులు ఎలా ఉండాలని అందరూ కోరుకుంటారో అలా ఉంటాయి నా కళ్లు. పెదవులు ఎంత అందంగా ఉండాలని ప్రతీ యువతీ యువకుడూ ఆశిస్తారో అలా ఉంటాయి నా పెదాలు. చీల్చిన దొండపండంటారో ఎర్రగులాబీ అంటారో.... మీ యిష్టం. అన్నీ నా అధరం ముందు దిగదుడుపే !

శంఖంలా ఉంటుంది నా మెడ. కాసయితే నా మెడలా ఉంటుందనవచ్చు శంఖం! వంగిన ధనుస్సులా ఉంటాయట కనుబొమలు. నా కనుబొమల తీరు విరిగిన ధనుస్సులా ఉంటుంది.

మొన తేలిన గడ్డం. పలచని చెక్కిళ్లు! నా చెక్కిళ్లు పలుచగా ఉండటంతో గులాబీల సోయగాన్నీ, మకరికాపత్ర సౌభాగ్యాన్నీ కాదనేట్టుంటాయి.

పిడికిలికి మించి, దోసిలికి లొంగి, నిండుగా నిటారుగా, ఒక చిన్ని నీలి మేలిలాడిమతో యవ్వనాన్ని స్ఫురిస్తున్నాయి. గిరుల దిట్టతనాన్ని తలదన్నే వక్షోరుహాలు! చూపులని ఆకట్టుకుంటాయవి.

తెగబారెడు జడకట్టు పిరుదుల మీద నాట్యం చేస్తుంది నా నడకకు అనుగుణంగా! నాకయినవారు నడుము తీరు బావుంటుందంటారు. కాని వారు అబ్బే! నడుం పస లేదు పొమ్మంటారు. జడకట్టు మొదలుకొని పాదాలదాకా ఎంచితగిన సౌరే తప్ప ఎంచేలోటు లేదు అంటారు వాడకట్టువారు. అరచందమామలాటి నుదురు అన్నిటికీ అందంగా ఉంటుంది.

ఈ సహజ సౌందర్యం చాలక మా అమ్మ ఎన్ని నగలు చేయించిందో! చేతులకి ముత్యాల గాజులు, చెవులకి రవ్వల దుద్దులు, కాళ్లకి గల్లు గల్లు మనే గజ్జెలు, నడుము మరింత గట్టిపడేట్టు వడ్డాణం, ముక్కుకి ముంగర, పాపట్లో నాగర, మెడలో రకరకాల ముత్యాల రత్నాల మేలి బంగరు గొలుసులు, చంద్రహారాలు, కాసుల దండలు ఎన్నో, కెంపుల హారాలు ఎన్నో.

నన్ను చూడాలా, నా అందం చూడాలా, నా నగలందం చూడాలా అని నన్ను చూసేవారు చర్చించుకునేలా వుంటానునేను. వీటి అన్నిటికీ తగినట్టు చీరకట్టు... రవిక మట్టు...

మా అమ్మ నన్నల్లారు ముద్దుగా పెంచి....నన్ను అత్తవారింటికి పంపలేక.. మా వారిని ఇల్లరికం తెచ్చుకుంది. ఆయన పేరు శాలీనుడు. నా పేరు చెప్పనే లేదు కదూ! నన్నంతా సుగాత్రి అంటారు. గాత్రం అంటే శరీరం. సుగాత్రి అంటే

సమపాళ్లలో పోతపోసిన మేలైన బంగారు బొమ్మలాంటి శరీరం కలది అని అర్థంలు! మాది కాశ్మీరం. మానాన్న సరస్వతీ ఉపాసకుడు. అందుకే నా పేరు అలా పెట్టాడు మా సీమ అందం మరెక్కడ ఉండదు. అలాగే నా వయ్యారం కాశ్మీరం. నా వయస్సూ కాశ్మీరం. నా సొగసు సోయగం కాశ్మీరం.

మా పెళ్ళయింది.

ఆ రాత్రి మా ఇద్దర్నీ గదలోకి పంపించాడు.

జీవితానికంతకూ శోభాయమానమైన శోభనం.

అయితే ఏం?

లోపలికి వచ్చిన నన్ను మావారు తలెత్తి మాశారే· తప్ప కిమ్మలేదు. రమ్మనలేదు.

నేనలాగే తలుపు వెంతనే తెల్లార్చుకుని బయటికి వచ్చాను. నన్ను మాశారు వెలికత్తెలు! సొగసు మాయకుండా సోయగం చెడకుండా చీరలనలక్కుండా తలకట్టు కదలకుండా తలకట్టులోని పూలు వాడకుండా లోపలికి ఎలా వెళ్లానో అలాగే బయటికి వస్తే... అదంతా అమ్మకు చెప్పారు. నవ్వారు.

భలేవాడు మీ అల్లుడు! ప్రపంచంలో ఎక్కడా యిలా వుండడు. ఏం కారణమో! ఏమో! భళిరా! ఈ రోజుకిలా అయ్యింది రేపు మాద్దాం ఏమవుతుందో అన్నారు.

................................ భూమిలో

ఏయెడ లేని చందమిది ఏమి నిమిత్తమొ యెంచ మంచి లే
బ్రాయపు వాడు గల్గె బళిరా యితడంచు ఎవ్వైన నేటికిన్
పోయెనొ కాక ఎల్లి తమ పోకలు చూడమ యంచు నవ్వనన్.

అలా అంటే మా అమ్మ ఓసీ గయ్యాళీ! సిగ్గు లేకుండా ఏం మాట్లాడ్తున్నారే అని గద్దించింది.

రెండో రోజూ వెళ్ళిన దాన్ని వెళ్లినట్టే వచ్చాను.

మూడో రోజూ అంతే అయ్యింది.

ఊరికే లోపలికి పంపటం.... ఉస్సురుమంటూ వెలికి రావడం.

అదంతా గమనించారు మా స్నేహితురాళ్లు

పాలతి ఆలిమగల పొడుము లేమియు
    గలిగినట్టి చొప్పు గానరాదు

మీ తెరగు చూడ మేల్మేలు దంపతు
    లిరువురును వివేకు లేమి చెప్ప?
కాంతు డుచితజ్ఞుడైనను కాంతకు సిగ్గువడ చెల్లుగాక కటకటా
కాంతుడు సిబ్బితికాడై కాంతయు అట్లైన నెట్లు కాపురమింకన్.

"ఏమే సుగాత్రీ! భార్యాభర్తల లక్షణాలు బొత్తిగా వున్నట్టు లేవు! మీ రిద్దరూ బుద్ధిమంతుల్లాగే ఉన్నారు. మీ ఆయనకి తెలుసుననుకో నువ్వు సిగ్గరివైనా ఫరవాలేదు. కానీ ఆయనా మందబుద్ధి అయితే..... నీవూ ఆయనలాగే మిన్నకుంటే ఇక కాపురం సాగేదెల్లాగే!

అమ్మాయ్! యిలా ఎన్నాళ్లు? ఆయనేమీ అనడం లేదని నువ్వూ కిమ్మనక పోతే ఎలా? ఆయనకేం! మగమహారాజు. మగువ అలా అయితే ఎల్లా? నువ్వు మౌనంగా కూర్చుంటే ఎలా? అదో యిదో ఏదో సేవ చెయ్! అతడి మనస్సు కరుగుతుంది. ప్రేమతో తానే ముందుగా రారమ్మనలేదని ప్రతిరోజూ తిరిగొస్తే ఎలా? ఆకులివ్వు. వక్కలివ్వు! తాంబూలం ఇచ్చి పండిన తాంబూలం లాగే బ్రతుకూ పండించుకో!

    గారామున తొడ్తోడన రా రమ్మన డనుచు మగుడి రానేటికి క
    ర్పూరంబు తోడిబాగా లీరాదో? ఆకు మడిచి యీరాదో చెలీ!

పిచ్చిదానా! బంగారం వంటి ప్రాయం మంచం పాలు చెయ్యొద్దు. వయస్సు భోగముల పంట! ఆమని! దాన్ని వృధా చేయకు!

అలా వాళ్లంతా అంటూంటే.... చేతులెత్తి మొక్కాను. ఏదో ఇదే నా భాగ్యం సౌభాగ్యం అనుకుంటూ! మీరేం అనకండి! అనేలా అమ్మను రెచ్చకొట్టకండి! అని వారించి ఆయన ఆయురభివృద్ధి కని వివిధాలంకారాలు చేసుకుంటున్నాను.

అయితే అమ్మ ఓర్చుకోలేక పోయింది! నా ఆస్తికి ఐశ్వర్యానికి దిక్కయ్యే మొగమొలకక నీ కడుపున పుడ్తాడని ఆశపడ్డాను! ఇతడు ఒట్టి గొడ్డు! సుగాత్రీ! ఊరకే తిని పండి ఉండడం ఎందుకు? అలా వెళ్లి పువ్వులతోటను చూసుకుంటూ ఉండమను అన్నది.

పాపం నోరెత్తలేదు శాలీనుడు. ఆ పువ్వులు శారదాదేవి పూజకే కదా అని తోట పనులకు దిగి తోటమాలి అయ్యాడు. కష్టపడ్డాడు. అతని కష్టం చూళ్లేక నేనూ తోడు వెళ్లడం సాగించాను.

మా అమ్మ వద్దన్నా ఆయన వద్దన్నా వినకుండా ఆయనతో చేయి చేయి

కలిపి తోటపని వెయ్యాలనుకున్నాను. ఇన్ని అలంకారాలతో తోటపని వెయ్యడం కష్టమని... అన్నీ తీసి ఓ చోట దాచి. ఆ పట్టుపుట్టాలు విడిచి.... నూలుచీర మట్టుకుని ఆయనతో పాటే పనిలోకి దిగాను.

త్రవ్వడంలో.... నీళ్ల పారించడంలో... మోయడంలో గబగబా నడవడంలో.... చలత్ భంగిమల్లో నన్ను చూశాడాయన

కదిలే కురులు.... కొప్పు... అదిరే పిరుదులు.... పెదాలు చెమ్మట కమ్మిన నుదురు.... చెక్కిళ్ల చూసి..... వెర్రిదానా! నువ్వెక్కడ? నీ సౌకుమార్యం ఎక్కడ? ఈ: కష్టమైన తోట పనులు ఎక్కడ? అంటూ నన్నాపి, తన ఉత్తరీయంతో చెమ్మట తుడిచాడు.... అయినా ఆయన తొలిసారి నన్ను స్పృశించడంతో.... నాలో చెలరేగిన తమకానికి యింకా చెమటలు కార్తూనే ఉన్నాయి... అది చూసి చాలా అలశానని చేరదీసి, చెంతచేర్చి, కౌగిటకూర్చి ఎన్నో ఓదార్పు మాటలు చెప్పాడు.

అలిశానని.... సొలిశానని పూ పొదరిల్లు చేర్చాడు
ఒకరి కౌగిల్లో ఒకరం.....
ఆయన నన్ను తనతో చేర్చుకుని నాలో చేరాడు
చాల్లెండి పగటి భాగోతం అని ఇంటికి వెళ్లాను నేను

నన్ను చూసి.... నలిగిన నా అందం చూసి, అమ్మ సంతోషించింది. ఆ రాత్రి మళ్లీ నన్ను సర్వాలంకార శోభితను చేసి గదిలోకి పంపింది అమ్మ... ఆ నగలు.. ఆ చీరలు... అన్నీ అలాగే... అలాగే మా ఆయనాల పాతలాగున్నే!

ఉస్సురని నిట్టూర్చి, అలసి పోయారా అని నాకై నేను చొరవ చేసుకుని ప్రశ్నించాను.

'కదు త్రిమ్మలచే శ్రమ మొందినారు కాబోలును ? పోదునా ? నిదుర పోయెదరే?' అని కప్పురంపు తాంబూలపు తావి భగ్గరని ముంచుకొనం చెవిదండ పల్కినన్

పైకొన్న పరాకున నత
'డే కోర్కిని వచ్చి' తనియె; నింతియు నగతో
'లోకము వారలు పలి'
కే కోర్కిని వత్తు' రన నెంతయు సొలసెన్

'ఏం వచ్చావు?' అన్నారాయన పరాకుననో... చిరాకుననో.. 'భలేవారే!

మొగుడి వద్దకు భార్య ఏ కోరికతో..' అని నిష్ఠూరంగా అన్నాను. మళ్లీ ఆగి, 'మిమ్మల్ని ఏమనగలను? వేగు జాము అవుతోంది. పాదాలొత్తరమ్మనరు... ఇలా రమ్మనరు... కన్నెత్తి చూడరు... పన్నెత్తి పలుకరించరు... ఆ రోజు ఆ తోటలో.. ఏ పూర్వపుణ్యాన్నో మీ దయ లభించింది. ఆ చనవుతో మిమ్మల్ని పలుకరించాను. అంటున్నాను. అంతేకానీ నేను రాలు గాయిని కాదు'. అని చెంతచేరి ఆయన పాదాలు చేతుల్లోకి తీసుకుని సంవాహనం చేశాను.

పాదాలు నా అవయవాల్ని తాకుతున్నా ఆయనలో చలనం బొత్తిగా లేదు. లేనేలేదు. అంతా పరాకే... (నయం చిరాకు లేదు ఎలా ఉంటుంది లెండి చిరాకు? నా సొమ్మైంది అది)

దాంతో......

చిత్తము వేరొకర్తుపయి చేర్చి మరల్పగ నేరరేమొ మీ
రత్తరళాక్షి తెచ్చుకొనుఁ డాయక నా వశమైన పంపు డే
దెత్తు నవశ్యమున్ మరియు దేవరకుంబలె నవ్వధూటికిం
దొత్తగుచుం బనుల్ సలుపుదు న్నిజమాడెద దైవ సాక్షిగాన్.........

'నాథా! మీకు ఎవరి మీదన్నా మనసుందా? ఉంటే ఆమెను తెచ్చుకోండి. సుఖపడండి! కాదంటే నాతో చెప్పండి! నే వెళ్లి తోడు తెస్తా! మీకూ ఆమెకూ సేవలు చేస్తా' అన్నాను.

దానికి సమాధానం మౌనమే అయ్యింది. రేయి గడిచిపోయింది.

మళ్లీ తెల్లారింది.

ఆయనతో పాటే తోటకు వెళ్లాను. మళ్లీ పనులు చేసి అలసిపోయాను. ఆయన నా చెంతచేరి.... కౌగిట చేర్చి... సేదదీర్చి.. వలపు పేర్చి సుఖింప జేశారు 'తన్మతికి వట్టి సొంపులే కాని భూషణా లింపు గామి' అనుకున్నాను.

చిక్కింది రహస్యం అనుకున్నాను.

రోజూ తోటకు వెళ్లసాగాను. నగలన్నీ పక్కన పెట్టి మట్టి పని చేసి అలసి సొలసి ఆపై ఆయనకు చేరువవుతున్నాను. వనంలో యవ్వనాన్ని సార్థకం చేసుకుంటున్నాను.

చిత్రమైన వారు కదూ మా ఆయన! వింతగా ఉన్నా సహజ సౌందర్యాభి లాషిగా సహజ సౌందర్యాన్ని మెచ్చి... నగలసొగసులో వచ్చే కృత్రిమ సౌందర్యాన్ని నచ్చని మెచ్చని ఆయన.... అరుదైన మనిషే కదూ?

ఇంకా వివరంగా మా కథ కావాలా?

'ఇదిగో నయ్యా! అనఘము వారల చరిత్ర...' చదవండి! ఎక్కడ?

నంద్యాల కృష్ణమరాజుచే...

ఒక్క మహాప్రబంధము కదున్ నిర్నిద్ర సారస్య లీ
లా చిత్రంబగుదాని ఓ అనఘ! వాలాయంబు చేయించుకో
మా చిత్తంబున వేడ్కయుండు... అది నీ మాధుర్యధుర్యోరువాక్
వైచిత్రిన్ సఫలంబు చేయుము సుధీవర్గంబు లోహో యనన్

అని అడగబడి; పింగళి సూరనామాత్యునిచే అతి అపూర్వ కథా సంవిధాన వైచిత్రీ మహనీయం'గా కళాపూర్ణోదయంగా రచింపబడింది. ఆ మధుర ప్రబంధం చదవండి!